క్లుప్తంగా

ఆలయాలకు శ్రావణ శోభ


సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అమ్మవారి ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకున్నాయి. శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో సంతోషిమాత, మహంకాళి దేవాలయాలు భక్తులతో సందడిగా మారాయి. మహిళలు అమ్మవారికి సామూహిక వ్రతాలు, కుంకుమార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంబులెన్స్‌లో ఆకస్మిక తనిఖీ


అంబులెన్స్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

నారాయణఖేడ్: ఈఎంఆర్ఐ- గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థతో రాష్ట్ర హెచ్ఆర్ అధికారి కిరణ్ కిషోర్, సంస్థ మరో అధికారి రవీంద్ర శుక్రవారం ఖేడ్‌లోని 108, 102, 1962 అంబులెన్స్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును పరిశీలించారు. సేవల గురించి అడిగి తెలుసుకుని సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. వారి వెంట ఉమ్మడి మెదక్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్, షేక్ శాలిహుస్సేన్, కిరణ్‌కుమార్, 108, 102 సేవల జిల్లా మేనేజర్లు, పైలెట్ జగన్నాథ్, ఈఎంటీ వీరేందర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల పరిశీలన


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కొండాపూర్(సంగారెడ్డి): మండల పరిధిలోని మన్‌సాన్‌పల్లిలో శుక్రవారం ఎంపీడీఓ సత్తయ్య యాదవ్ నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇళ్లు మంజూరు అయిన వారు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. విడతల వారీగా లబ్ధిదారులకు నిధులు మంజూరు అవుతాయన్నారు. అనంతరం గ్రామంలో పర్యటిస్తూ నర్సరీ, అంగన్‌వాడీ కేంద్రం, ప్రైమరీ స్కూల్‌లో పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మీని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్‌తో పాటు ఇందిరమ్మ ఇళ్ళ కమిటీ సభ్యులు , అంగన్‌వాడీ టీచర్‌లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారాన్ని తనవంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ 11, 12వ బ్లాక్‌లో నూతనంగా నిర్మిస్తున్న భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నట్లు తెలిపారు. పలు కాలనీల్లో పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆత్మకమిటీ డైరెక్టర్ కావలి నగేష్, నాయకులు ఐలేష్, పీటర్, మల్లేశం పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు టౌన్: నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామానికి చెందిన సురేష్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. చికిత్స నిమిత్తం రెండు లక్షల రూపాయల ఎల్‌ఓసి మంజూరయింది. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సురేష్ కుటుంబ సభ్యులకు ఎల్‌ఓసీ అనుమతి పత్రాలు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, పాండు, కాశిరెడ్డి పాల్గొన్నారు.

ముసురు వర్షం.. ఉరుస్తున్న గదులు

కూలేందుకు సిద్ధంగా తరగతి గదులు

- కారుతున్న పైకప్పులు
- పెచ్చులూడి పడుతున్న పైనం
- ఏటా నివేదికలతో కాలం వెళ్లదీత


ఘన్‌పూర్‌లో పెచ్చులూడి పడిన పాఠశాల భవనం


జమ్మి(బీ)లో తడిసి నీరు కారుతున్న గదులు

కంగ్టి(నారాయణఖేడ్): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు తడిసి ముద్దయ్యాయి. తరగతి గదులు ఉరుస్తున్నాయి. మండలంలోని బాన్సువాడ గ్రామంలో పైకప్పు ఉరుస్తుండడంతో తరగతి గదిలోకి నీరు చేరాయి. ప్రాథమిక పాఠశాలకు ఒకే తరగతి గది ఉండి అది కూడా కారుతోంది. భీంరాలో ప్రాథమిక పాఠశాల భవనం గోడల వెంట నీరు కారుతున్నాయి. అంగన్‌వాడీ భవనం కూడా అక్కడే ఉంది. పక్కన ఉన్న పంట పొలాల్లో చేరిన నీరు పాఠశాల మైదానంలో చేరి చెరువును తలపిస్తున్నాయి. ఘన్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో పైకప్పు పెచ్చులూడి పడ్డాయి. జమ్మి(బీ) ప్రాథమికోన్నత పాఠశాల తరగతి గదులతో పాటు పైకప్పు ఉరుస్తోంది. చింతామణి తండా పాఠశాల పైకప్పు కిందికి వంగడంతో పైన నీరు నిలుస్తున్నాయి. దీంతో తరగతి గదితో పాటు వరండాలో సైతం నీరు కారుతోంది. మండలంలో 49 గ్రామాల్లో పాఠశాలల భవనాలు ఉండగా అందులో 17గ్రామాల్లో మన ఊరు.. మన బడిలో నిర్మాణ పనులు చేపట్టినా అర్ధాంతరంగా ఆగిపోయాయి. 34పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, తరగతి గదుల నిర్మాణం కోసం అమ్మ ఆదర్శ పాఠశాలలో నిధులు వెచ్చించి పనులు ప్రారంభించినా ఒక్కటి సైతం పూర్తిస్థాయిలో కాలేదు. దీంతో పూర్తిస్థాయిలో పనులు జరగకపోవడంతో విద్యార్థులకు ఉపయోగంలోకి రావడం లేదు. మరుగుదొడ్లు, మూత్రశాలల మరమ్మతులు చేసినా.. నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారాయి. అధికారుల ఆలసత్వంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రాణాపాయంగా ఉన్న తరగతి గదుల్లో చదువులు చెపుతూ.. ప్రమాదం జరిగితే గాని పట్టించుకోరా అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలో 3285 మంది విద్యార్థులు

కంగ్టి మండలంలో మొత్తం 3285 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మండలంలో 3 జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో 1003 మంది విద్యార్థులు, 10 యూపీఎస్ పాఠశాలల్లో 944 మంది విద్యార్థులు, 36 ప్రాథమిక పాఠశాలల్లో 1338 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు.

ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నాం..



మండలంలోని కొన్ని గ్రామాల్లో పాఠశాల భవనాలు వర్షానికి కురుస్తున్నాయి. జమ్మి(బీ), ఘన్‌పూర్‌లో పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఆయా గ్రామాల్లోని పాఠశాలల నిర్వహణకు ప్రత్యామ్నాయం కోసం ప్రయత్నం చేస్తున్నాం. ఇతర గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ప్రైవేటు భవనాలు ఉంటే అడిగి తరగతులు అక్కడే జరిపేలా చర్యలు తీసుకొంటాం.

–మహ్మద్ రహీమోద్దీన్, ఎంఈఓ, కంగ్టి

మంచి ఆహారం అందించాలి

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య


హాస్టల్‌లోని ఆహారాన్ని పరిశీలిస్తున్న సౌజన్య

సంగారెడ్డి టౌన్: హాస్టల్‌లోని విద్యార్థులకు సరైన ఆహారం, వసతులు కల్పించాలంటూ జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. వర్షాకాలం విద్యార్థులకు ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రణాళిక కార్యక్రమాలు


పనులు పరిశీలిస్తున్న కమిషనర్ కిషన్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 100 రోజుల ప్రణాళిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ప్రత్యేక అధికారి చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్ కిషన్, ఆరోగ్య అధికారి నిర్మలారెడ్డి పలు వార్డుల్లో పర్యటించి సీజనల్ వ్యాధులపై స్థానికులకు అవగాహన కల్పించారు. అనంతరం పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జియో ట్యాగింగ్ ప్రక్రియ, ప్రాపర్టీ టాక్స్, దారి పొడవునా పెరిగిన పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను కార్మికులతో శుభ్రం చేయించారు. ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ మల్లికార్జున స్వామి, ఆర్వో నర్సింలు, ఏఈ కిష్టయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ ఆరోగ్య వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బనకచర్లకు వ్యతిరేకంగా జంగ్ సైరన్


బనకచర్ల ప్రాజెక్టు వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్న రాజేందర్ నాయక్

నారాయణఖేడ్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా నదుల అనుసంధానంతో నిబంధనలకు విరుద్ధంగా బనకచర్ల ప్రాజెక్టుకు వ్యతిరేకంగా శుక్రవారం ఖేడ్‌లో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో బనకచర్ల జంగ్ సైరన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ కళాశాలల్లో నిర్వహించిన సమావేశాల్లో బీఆర్ఎస్‌వీ జిల్లా సమన్వయ కర్త రాజేందర్‌నాయక్, ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు అంజాగౌడ్, బనకచర్ల ప్రాజెక్టు వల్ల తెలంగాణకు కలిగే నష్టాలను గురించి విద్యార్థులకు వివరించి.. సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి మన్సూర్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షుడు నగేష్, జిల్లా, స్థానిక బాధ్యులు శ్రీహరి, అశోక్‌రెడ్డి, పవన్ పాటిల్, లక్ష్మణ్‌నాయక్, నర్సింహులు యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ


రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ సంగారెడ్డి

జోగిపేట(అందోలు): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి జ్వరం వచ్చినా అశ్రద్ధ చేయకుండా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని జిల్లా డీసీహెచ్ఎస్ డాక్టర్ సంగారెడ్డి అన్నారు. శుక్రవారం జోగిపేట పట్టణంలోని ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌజన్య, ఆర్ఎంఓ అశోక్, వైద్య సిబ్బందితో కలిసి ఆస్పత్రిలోని ప్రతి వార్డును కలియ తిరుగుతూ రోగులకు ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారని రోగులు చెప్పడంతో వైద్యులను అభినందించారు. సీజనల్ వ్యాధులు సమయం కావున మరింత మెరుగైన వైద్యం చేసేలా వైద్యులు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారికి సూచించారు. విధుల పట్ల ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై శాఖపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

ధర్నాలకు సిద్ధంకండి


విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

కంగ్టి(నారాయణఖేడ్): తడ్కల్‌ను మండలంగా చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మండలం ప్రకటించక పోతే ధర్నాలు, రాస్తారోకోలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. శుక్రవారం తడ్కల్‌లోని విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో ప్రచారం కోసం వచ్చే ముందు మండలం ప్రకటించాలని.. లేనట్లయితే ఎమ్మెల్యే, ఎంపీలను గ్రామాల్లో అడ్డుకొంటామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులు ఇంటర్‌లో బైపీసీ, ఎంపీసీ కోర్సులు చదవడానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి లలిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బైపీసీ 5 సీట్లు, ఎంపీసీఓ 25 సీట్లు అందుబాటులో ఉన్నాయని విద్యార్థినులు ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ ఉపాధి కూలీ పనులపై తనిఖీ

నారాయణఖేడ్: నిజాంపేట్ మండలంలోని రాంరెడ్డిపేట్, బాచేపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ సంగ్రాం శుక్రవారం పరిశీలించారు. ఉపాధిహామీ సిబ్బంది, కూలీలతో మాట్లాడి కల్పిస్తున్న పనులు, అందుతున్న కూలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. శనివారం కేంద్ర ఎన్ఆర్ఈజీఎస్ టీం సభ్యులు గ్రామాలను సందర్శించనున్న నేపథ్యంలో కూలీలతో సమావేశమయ్యారు.

◆ మొక్కలు నాటి సంరక్షించాలి

జహీరాబాద్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. మెప్మా ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో వందకు పైగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు మాట్లాడుతూ .. మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అస్లాం ఫారూఖీ, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించండి

వట్‌పల్లి(అందోల్): స్థానిక సంస్థల ఎన్నికల్లో వికలాంగులకు ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించాలని వికలాంగుల సంఘం (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల వికలాంగుల సంఘం నాయకులతో కలిసి ఎంపీడీఓ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చాలన్నారు. దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంపుతో పాటు ఆర్టీసీ బస్సులో వంద శాతం ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు.

◆ డిగ్రీలో ప్రవేశాలకు మరో అవకాశం

నారాయణఖేడ్: ఖేడ్ మండలం జూకల్ శివారులోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీకళాశాలలో ప్రవేశాల కోసం దోస్త్ ద్వారా నాల్గవ విడతగా మరోమారు అవకాశం కల్పించామని కళాశాల ప్రిన్సిపాల్ డా.జి. నారాయణ తెలిపారు. డిగ్రీలో ప్రవేశాలు కోసం అభ్యర్థులు ఈనెల 31లోపు రిజిస్ట్రేషన్ చేయించుకుని వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవం

జహీరాబాద్ టౌన్: పట్టణ సమీపంలో మొగుడంపల్లి చౌరస్తాలోని ప్రసిద్ధ మహంకాళి ఆలయం 26వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం, బలిపూజ, బోనాల సమర్పణ, తీర్థప్రసాదాలు, అన్నదానంచేశారు. భక్తి గీతాలపాన, భజనలు, కీర్తనలు, సంస్కృతిలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు, డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా చైర్మన్ ఎం.శివకుమార్‌లు ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.

◆ కొనసాగిన గోతుల పూడ్చివేత

నారాయణఖేడ్: పట్టణంలోని ప్రధాన రోడ్లపై ఏర్పడిన గోతులను 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం పురపాలిక ఆధ్వర్యంలో పూడ్చివేత పనులు రెండవ రోజు శుక్రవారం కొనసాగించారు. శివాజీ చౌక్ సమీపంలో రోడ్డుపై పెద్దపెద్ద గోతులను జేసీబీ సహాయంతో కంకర, ఇసుక, సిమెంటు కలగలిపిన మిశ్రమంతో పూడ్చివేశారు. రాంవిలాస్ గల్లీలో మురుగు కాల్వలోంచి తీసిన మురుగు, పూడిక వర్షాలతో చిత్తడిగా మారి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుండటంతో వాటిని ఎత్తేశారు. పలుకాలనీల్లోనూ పారిశుద్ధ్య పనులను నిర్వహించారు. మున్సిపల్ కమిషనరు జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్‌లు పర్యవేక్షించారు.

రహదారుల పనుల్లో వేగంగా పెంచాలి

కలెక్టరు ప్రావీణ్య


సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి జోన్: జిల్లాలోని రహదారుల అభివృద్ధి పనులు వేగంగా చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆర్అండ్‌బీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రయాణంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. రాయికోడ్, మునిపల్లి మండలంలోని సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చడానికి రూ.42 కోట్ల మంజూరైనట్లు తెలిపారు. నిధులతో రాయికోడ్ మండలం సింగీతం గ్రామం నుంచి హస్నాబాద్ మీదుగా కోడూరు వరకు వెళ్లే ప్రధాన రహదారి, మునిపల్లి మండలం తాటిపల్లి నుంచి మక్తకేసారం వరకు రెండు వరసల రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రూ.17.7 కోట్లతో మునిపల్లి మండలం సింగూరు బ్యాక్ వాటర్‌లో హైలెవెల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పారు. సంగారెడ్డి వైద్య కళాశాల భవన నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేసి మెడికల్ కళాశాల యాజమాన్యానికి భవనం అప్పగించేలా ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ నర్సింలు, డిప్యూటీ ఈఈ రవీందర్, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలున్న వారికి ఇంటి లోన్లు


ప్రొసీడింగ్ కాపీని ఇస్తున్న మాధవరెడ్డి, కమిషనర్ ఉమ తదితరులు

సదాశివపేట(సంగారెడ్డి): ఖాళీ స్థలం ఉన్న మహిళలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షల మంజూరు చేస్తుందని.. లబ్ధిదారులు సద్వినియోగించుకోవాలని హౌజింగ్ డీఈఈ మాధవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని 9వ వార్డు ప్రియదర్శిని కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మహిళలకు ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ కాపీ అందించి ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమ, హౌజింగ్ ఏఈ రేష్మ, 9వ వార్డు అధికారి స్వామి, వార్డు ఇన్‌చార్జి వీరేశం, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్లు శంకర్‌గౌడ్, రవి, వార్డు అధికారులు నీరజ్‌కుమార్, సందీప్, పురప్రముఖులు యాదవరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి పాఠశాలలో లైబ్రరీ తప్పనిసరి

ఎంఈఓ మాణెయ్య


మాట్లాడుతున్న ఎంఈఓ మాణెయ్య

రాయికోడ్(అందోల్): ప్రతి పాఠశాలలో లైబ్రరీని తప్పనిసరిగా నిర్వహించాలని మండల విద్యాధికారి మాణెయ్య, హెచ్ఎం ఖైరత్ అలీలు ఉపాధ్యాయులకు సూచించారు. రాయికోడ్‌లోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం కాంప్లెక్స్ సమావేశం రెండవరోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి పాఠశాలకు లైబ్రరీ బుక్స్ అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులకు రోజువారీ పుస్తకాలను ఇచ్చి రికార్డులో నమోదు చేయాలన్నారు. ఈ నెల 30, 31వ తేదీల్లో లాంగ్వేజ్ ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లకు సమావేశాలు ఉంటాయన్నారు. రిసోర్స్ పర్సన్‌లు యాదవులు, లావణ్య ఉపాధ్యాయులతో సమావేశమై ప్రత్యేక బోధనాంశాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు సంగీత, నర్సింలు, ఖైరత్‌అలీ, శ్రీనివాస్, సీఆర్‌పీలు రాజు, దత్తు , ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.

అమీరాబాద్‌లో కేంద్ర బృందం పర్యటన


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కేంద్రసభ్యులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని అమీరాబాద్ గ్రామాన్ని శుక్రవారం స్వచ్ఛ భారత్ కేంద్రం బృందం సభ్యులు సందర్శించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కార్యక్రమంలో భాగంగా ఉదయం గ్రామానికి వచ్చిన సభ్యులు అశోక్‌రెడ్డి, దెశెట్టి స్వామి తదితరులు గ్రామంలో చేపట్టిన రోడ్లు, మురికి కాల్వల నిర్మాణం, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, తడి చెత్త, పొడి చెత్త సేకరణ, గ్రామ పంచాయతీ రికార్డులు తదితరాలను పరిశీలించారు. వివరాలను స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ గ్రామ పంచాయతీ ఎంపిక కార్యక్రమంలో భాగంగా కేంద్ర బృందం వివరాలను సేకరిస్తుంది. కేంద్ర బృందం సభ్యుల వెంట ఎంపీఓ సౌజన్య, ఎఫ్ఏ వైద్యనాథ్ ఉన్నారు.

కార్మికులకు ఈఎస్ఐ కొండంత బలం

ఈఎస్ఐ మేనేజర్ నాగయ్య


డిపాజిట్ లెటర్‌ను అందజేస్తున్న నాగయ్య

సదాశివపేట(సంగారెడ్డి): కార్మికులకు ఈఎస్ఐ కొండంత బలం అని ఈఎస్ఐ పట్టణ బ్రాంచ్ మేనేజర్ నాగయ్య అన్నారు. మండలంలోని పెన్నార్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ మండలంలోని బాబిల్‌గామ గ్రామానికి చెందిన లక్ష్మయ్య రోడ్డు ప్రమాదంలో మరణించాడు. శుక్రవారం ఆయన భార్య కరుణమ్మకు డెత్ బెనిఫిట్ కింద ఎస్‌బీఐ బ్యాంకులో డిపాజిట్ చేసిన లక్ష పదిహేను వేల రూపాయల లేటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు ఈఎస్ఐ తమ వేతనాల నుంచి కొద్దిపాటి చేసే జమతో అపారమైన సేవలు పొందవచ్చని తెలిపారు. ప్రతి నెల 21 వేల లోపు వేతనాలు కార్మికులకు ప్రమాదాల వల్లగానీ, అనారోగ్యం బారిన పడిన ఇతర సమస్యలు ఏర్పడితే మహిళలకు మెటర్నిటీ బెనిఫిట్‌లో కార్మిక బీమా సంస్థ ద్వారా చేయూతనందిస్తుందని తెలిపారు.

మౌలిక వసతుల కల్పనకు సహకారం

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


ఎమ్మెల్యేని సన్మానించిన ఐలా ప్రతినిధులు

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని పారిశ్రామికవాడలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. పటాన్‌చెరు ఐలా ప్రతినిధులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు శుక్రవారం వివిధ శాఖల అధికారులు, ఐలా ప్రతినిధులతో కలిసి ఐలా పారిశ్రామికవాడలో పర్యటించారు. ప్రధానంగా పరిశ్రమలకు తాగునీటి సౌకర్యం లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. వర్షాకాలంలో ఈదురు గాలుల మూలంగా విద్యుత్ లైన్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు ఆటంకాలు ఎదురవుతున్నాయని.. నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పారిశ్రామికవాడలో నూతన విద్యుత్ లైన్లతో పాటు నిరంతరాయ విద్యుత్ సరఫరాకు అనుగుణంగా లైన్లు ఏర్పాటు చేయాలని డీఈ భాస్కర్‌రావును ఆదేశించారు. అతి త్వరలో ప్రతి పరిశ్రమకు మంచినీటి కనెక్షన్లు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఐలా చైర్మన్ సుధీర్ రెడ్డి, విద్యుత్ శాఖ డీఈ భాస్కర రావు, ఐలా ప్రతినిధులు రంజిత్, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ ఈఓను నియమించాలి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్ గడ్డ దేవస్థానానికి రెగ్యులర్ ఈఓను నియమించాలని సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి, మంత్రి వివేక్ వెంకట్ స్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గణేష్ గడ్డ దేవస్థానం గత 20 సంవత్సరాలుగా వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. నిత్యం వేలాదిమంది భక్తులు స్వామివారి దర్శనం కోసం వచ్చి వెళ్తుంటారని తెలిపారు. దేవాలయానికి రెగ్యులర్ ఈఓ లేకపోవడంతో దేవాలయ పనులలో పర్యవేక్షణ కరువైందన్నారు. ప్రస్తుతం ఉన్న ఇన్‌చార్జి ఈఓ సరిగ్గా అందుబాటులో ఉండదన్నారు. దేవస్థానానికి చెందిన నాలుగు ఎకరాల భూమిని సాయి సూర్య డెవలపర్స్ కబ్జా చేస్తున్నా ప్రస్తుత ఈఓ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే రెవెన్యూ అధికారులతో సర్వే నిర్వహించి దేవస్థాన భూమిని కాపాడాలని కోరారు.